AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatoday.in

మెట్ట పంటలకు ఊపిరి



2



2

శస్త్రచికిత్సకు ఎల్వోసీ మంజూరు

రూరల్ ఎస్‌హెచ్‌వోగా శ్రీధర్ రెడ్డి బాధ్యతల స్వీకరణ



అక్షరటుడే, నిజామాబాద్ క్రైం: నిజామాబాద్ రూరల్ ఎస్‌హెచ్‌వోగా శ్రీధర్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో ఎస్‌బీలో పనిచేశారు. ఇటీవలి బదిలీల్లో భాగంగా ఆయన రూరల్ ఎస్‌హెచ్‌వోగా నియమితులయ్యారు. గతంలో ఇక్కడ పనిచేసిన శ్రీనివాస్‌ను నార్త్ సీఐగా బదిలీ చేస్తూ ఐజీ ఉత్తర్వులు జారీ చేశారు.

4-10-2026 NIZAMABAD / KAMAREDDY PAGES - 2

రైతుల సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం



అక్షరటుడే, భీమ్‌గల్: రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేస్తోందని బీజేపీ జిల్లా కిసాన్ మోర్చా నాయకులు మండిపడ్డారు. హామీల అమలులో జాప్యాన్ని నిరసిస్తూ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో చేపట్టిన బోధన్-జగిత్యాల సైకిల్ యాత్ర ఆదివారం బడా భీమ్‌గల్ మీదుగా భీమ్‌గల్ పట్టణానికి చేరుకుంది. యాత్రకు వచ్చిన నాయకులు, కార్యకర్తలకు మండల కిసాన్ మోర్చా, బీజేపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు పట్కూరి తిరుపతి రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో రైతులకు అనేక వాగ్దానాలు చేసిన కాంగ్రెస్, అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. రైతు రుణమాఫీ, రైతుభరోసా, పంటల మద్దతు ధరల కల్పనపై స్పష్టమైన విధానంతో ముందుకు రావాలని డిమాండ్ చేశారు. భీమ్‌గల్ మండల బీజేపీ అధ్యక్షుడు అరే రవీందర్ మాట్లాడుతూ.. రైతులకు ఇచ్చిన్ హామీలను వెంటనే అమలు చేసి న్యాయం చేయాలని, బాధితుల పక్షాన బీజేపీ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు యోగేశ్వర నర్సయ్య, మండల కిసాన్ మోర్చా అధ్యక్షుడు తోట గంగాధర్, పట్టణ అధ్యక్షుడు నీలం గంగాధర్, కప్కల్ సర్పంచ్ నర్సింగ్ రావు, యువ మోర్చా అధ్యక్షుడు ప్రేమ్ చంద్, ఉపసర్పంచ్ హరికృష్ణ, నాయకులు పార్థ సారథి, కార్తీక్, చిరునంచ రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జనాల్లోకి చిరుతలు..



- భయాందోళనలో ప్రజలు
- రహదారులపై సంచారం..
- పలు గ్రామాల్లో పశువులపై దాడులు
- పొలాలకు వెళ్లేందుకు జంకుతున్న అన్నదాతలు

ఉమ్మడి జిల్లాలో చిరుత పులుల సంచారం ప్రస్తుతం సర్వసాధారణంగా మారిపోయింది. ఒకప్పుడు అడవికి మాత్రమే పరిమితమైన చిరుత పులులు నేడు దర్జాగా జనాల్లోకి వస్తున్నాయి. గ్రామాల శివారులో ప్రధాన రహదారులపై చిరుత పులుల సంచారంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. రాత్రి పూట బయటకు వెళ్లాలంటే అటవీ ప్రాంత శివారు రైతులు భయంతో వణికిపోతున్నారు. - అక్షరటుడే, కామారెడ్డి

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో చిరుత పులుల సంచారం పెరిగిపోతుంది. వ్యవసాయ భూములు, ఇళ్ల మధ్య చిరుతలను చూసి ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. పశువుల కొట్టాలపై దాడులు చేసి ఆవులు, గేదెలు, మేకలను చంపుకుని తిని ఆకలి తీర్చుకుంటున్నాయి. ఇటీవల చిరుత పులుల సంచారం ఎక్కువ కావడంతో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు.

అడవిలో ఉండాల్సిన చిరుతలు జనాల్లోకి వస్తున్నాయి. అడవులు ఆనుకుని ఉన్న గ్రామాలు మాత్రమే కాకుండా ఇతర గ్రామాల్లో సైతం చిరుతలు సంచరిస్తున్నాయి. వ్యవసాయ పొలాలకు ఆనుకుని ఉన్న ఇళ్ల వద్ద కొందరు రైతులు పశువుల కోసం ప్రత్యేకంగా షెడ్లు వేసుకుంటున్నారు. వాటిని చూస్తున్న చిరుతలు పశువులపై దాడులకు పాల్పడుతున్నాయి. అలాగే వ్యవసాయ పొలాలు, అటవీ ప్రాంతాల్లో మేతకు తీసుకెళ్లిన పశువులపై దాడులకు పాల్పడుతున్నాయి. చిరుత పులుల సంచారం.. పశువులపై వరుస దాడుల నేపథ్యంలో వ్యవసాయ పనులు చేసుకునే రైతులు ఆందోళనకు గురవుతున్నారు. అడవికి పక్కనే ఉన్న వ్యవసాయ పొలాల వద్దకు వెళ్లేందుకు జంకుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో వరుస దాడులు

ఈ ఏడాది మొదట్లో తాడ్వాయి మండలంలోని ఎర్రపహాడ్, పల్లెగడ్డ తండా, కన్కల్, మోతె శివారులో చిరుతలు పశువులపై దాడులు చేశాయి. మే 19న జుక్కల్ మండలం బంగారుపల్లి గ్రామంలో పశువుల పాకపై చిరుత దాడిలో ఓ గేదె మృతి చెందింది. ఆగస్ట్ 31న నాగిరెడ్డిపేట మండలం వెంకంపల్లి గ్రామ శివారులో ఓ రైతు పొలం వద్దకు వెళ్తుండగా చిరుత కనిపించడంతో గ్రామస్తులకు సమాచారం ఇచ్చాడు. గత నెల 25న జుక్కల్ మండలం పఙ్రాఖండి గ్రామ శివారులో చిరుత పాదముద్రలు లభించాయి.

ఈ నెల 3న పిట్లం మండలం చిల్లర్గి గ్రామ శివారులో చిరుత దాడిలో లేగదూడ మృతి చెందింది. గతంలో అడవిలో తాగడానికి సెలయేర్లు, కుంటలు పుష్కలంగా ఉండేవి. అవి ఉండేందుకు దట్టమైన పొదలు ఉండేవి. గ్రామాల్లో 10 శాతం భూమి పశువుల మేతకు ఉండటంతో మనుషులు అడవిలోకి వెళ్లేవారు కాదు. ప్రస్తుతం ఈ వసతులు అడవిలో లేకుండా పోయాయి. అక్రమ వేటతో అడవిలో చిరుతలకు ఆహార జంతువులు తగ్గిపోయాయి. మేత భూములు కబ్జాలకు గురై పశువుల కాపరులు అడవిలోకి వెళ్లడంతో చిరుతలు అడవి బాట వదిలి జనాల్లోకి రావడానికి ప్రధాన కారణాలుగా చెప్తున్నారు.

తాజాగా మోపాల్ మండలంలో..

మోపాల్ మండలం మోతీరాం నాయక్ తండా నుంచి కాల్పోల్ వెళ్లే దారిలో శుక్రవారం కొందరికి చిరుత కనిపించింది. దీంతో భయాందోళనలకు గురైన వారు వెంటనే సమీప గ్రామాల ప్రజలకు అలర్ట్ చేశారు. అటవీశాఖ అధికారులు సైతం మోపాల్ గ్రామాన్ని సందర్శించారు. ప్రస్తుతానికి ఒంటరిగా రాత్రివేళల్లో బయటకు రావొద్దని.. అత్యవసరమైతే తప్ప అటవీప్రాంతం వైపు వెళ్లవద్దని అధికారులకు సూచించారు. జూలైలో ఇందల్వాయి మండలం ఎల్లారెడ్డి గూడెంలో ఓ పౌల్ట్రీ ఫాం సమీపంలో చిరుత సంచరించినట్లుగా సీసీ కెమెరాల్లో రికార్డ్ అయ్యింది.



కవల శిశువులకు ఆపన్నహస్తం

అక్షరటుడే, బాన్సువాడ: వర్ని మండలం జలాల్‌పూర్ గ్రామానికి చెందిన తిప్పారం ఆనంద్ గౌడ్ దంపతులకు కవల పిల్లలు జన్మించారు. అయితే అనారోగ్య పరిస్థితుల్లో వారిని హైదరాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. కుటుంబం ఆర్థికంగా బలహీనంగా ఉండటంతో చికిత్స ఖర్చుల కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం గ్రామస్తుల ద్వారా సమాజ సేవకుడు సీతలే రమేష్ దృష్టికి వచ్చింది. విషయం తెలిసిన వెంటనే స్పందించిన సీతలే రమేష్, తన వాట్సాప్ స్టేటస్ ద్వారా విషయాన్ని తెలియజేసి దాతల నుంచి ఆర్థిక సహాయాన్ని సేకరించారు. అనంతరం జలాల్‌పూర్ గ్రామానికి వెళ్లి కవల పిల్లల బంధువులకు రూ. 45,400 నగదును అందజేశారు. సీతలే రమేష్ మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న కుటుంబానికి ప్రతి ఒక్కరూ తమకు తోచిన సహాయం చేయాలని, చిన్న సహాయం కూడా ఆ కుటుంబానికి ఎంతో అండగా నిలుస్తుందని అన్నారు. శంకర్ గౌడ్, కొయ్యడ శ్రీనివాస్ గౌడ్, సుధాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకట్ గౌడ్ పాల్గొన్నారు.

అట్టహాసంగా కామారెడ్డి ఫిజీషియన్స్ అసోసియేషన్ ప్రమాణ స్వీకారం



అక్షరటుడే, కామారెడ్డి: కామారెడ్డి ఫిజీషియన్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం ఆదివారం నిర్వహించారు. స్థానిక ఐఎంఏ భవనంలో ఈ కార్యక్రమం జరిగింది. అసోసియేషన్ ఆఫ్ ఫిజీషియన్ ఆఫ్ ఇండియా తెలంగాణ చాప్టర్‌లోని కామారెడ్డి బ్రాంచ్ ఆధ్వర్యంలో కార్యవర్గం కొలువుదీరింది. ఫిజీషియన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా వెంకట్, జనరల్ సెక్రెటరీగా నవీన్ కుమార్, కోశాధికారిగా జమాల్, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్ రావు, జాయింట్ సెక్రెటరీగా జయచంద్ర ప్రమాణ స్వీకారం చేశారు. జాతీయ అధ్యక్షుడు నర్సింలు, రాష్ట్ర అధ్యక్షుడు డా.నవాల్ చంద్ర, సెక్రెటరీ త్రిలోక్ చందర్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతినెల ఒక గ్రామాన్ని దత్తత తీసుకుని ప్రత్యేక హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేయాలని సూచించారు. షుగర్, బీపీ, కిడ్నీ, ఇతర వ్యాధులకు సంబంధించిన స్క్రీనింగ్ చేయాలన్నారు.

పిచ్చిమొక్కల మధ్యలో ట్రాన్స్‌ఫార్మర్

అక్షరటుడే, నందిపేట్: మండల కేంద్రంలో పాతూరు గల్లిలో లక్ష్మీనృసింహాస్వామి ఆలయం వెనక విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పిచ్చిమొక్కల మధ్య చిక్కుకుపోయింది. ఫెన్సింగ్ సైతం పిచ్చి మొక్కలతో పూర్తిగా కప్పేసింది. ప్రధాన రహదారికి పక్కనే ఇది ఉండడంతో ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి వర్షం వచ్చిన కరెంటు సరఫరా నిలిచిపోతుందన్నారు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడంలేదన్నారు. వెంటనే ట్రాన్స్‌ఫార్మర్ చుట్టు పిచ్చిమొక్కలను తొలగించాలని కోరారు.



6న ఉమ్మడిజిల్లా వాలీబాల్ ఎంపిక పోటీలు

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: ఉమ్మడిజిల్లా వాలీబాల్ ఎంపిక పోటీలు ఈనెల 6వ తేదీన నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. జడ్పీహెచ్ఎస్ కలిగోటలో అండర్ -19 బాలబాలికలకు ఎంపిక పోటీలు ఉంటాయని వివరించారు. క్రీడాకారులు ఇంటర్ రెగ్యులర్ ఫస్ట్, సెకండ్ ఇయర్ చదువుతూ.. 2008 జనవరి 1వ తేదీ తర్వాత పుట్టినవారై ఉండాలని సూచించారు. 6వ తేదీన మధ్యాహ్నం 2గంటలకు బాలికలు కలిగోట్ పాఠశాలలో, బాలురు ట్రైబల్ వెల్ఫేర్ బాలుర కళాశాల కామారెడ్డిలో తమ బోనోఫైడ్స్, ఆధార్, సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు. ఇతర వివరాలకు బాలురు సత్యనారాయణ 94405 72314ను, బాలికలు యాదగిరి 94902 94414ని సంప్రదించాలని కోరారు.

రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



అక్షరటుడే, ఇందూరు: నగరంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బొబ్బిలి వేణుగోపాల్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గంధమల్ల ఆనంద్ గౌడ్ పిలుపు మేరకు జిల్లా కోర్టు చౌరస్తాలో వాహనదారులకు ట్రాఫిక్‌పై అవగాహన కల్పించామన్నారు. ప్రధాని మోదీ ప్రజాప్రతినిధిగా 25ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఓబీసీ మోర్చా జిల్లా ప్రభారీ సాయి కిరణ్, ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు స్వామి యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి దుద్దోళ్ల గిరి బాబు, జిల్లా ఓబీసీ ఉపాధ్యక్షుడు ప్రకాష్, ఓబీసీ మోర్చా పదాధికారులు నరేష్ గౌడ్, మరెడ్డి సురేష్, సతీష్, అమంద్ కృష్ణ, రాజ్ కుమార్, సాయి, శేఖర్, కృష్ణ పాల్గొన్నారు.

దూస్‌గాంలో ఘనంగా ఊర పండగ

అక్షరటుడే, డిచ్‌పల్లి: మండలంలోని దూస్‌గాం గ్రామంలో ఆదివారం ఊర పండగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఊరేగింపులు, డప్పు చప్పుళ్లు, పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాల మధ్య బోనాలు సమర్పించారు. గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో వీడీసీ చైర్మన్ బొల్లారం జనార్ధన్, సభ్యులు కొండా సత్యం, గొల్ల రాజు, గంగాధర్, భూషణ్, సాత్విక్, ముల్కా సువర్ణ వెంకట్, ఉప సర్పంచ్ కొండ మురళి, గ్రామ పెద్దలు రాజేశ్వర్, నరసింహా రెడ్డి, ప్రజలు పాల్గొన్నారు.



ఉత్కంఠగా కొనసాగుతున్న రెడ్‌క్రాస్ ఎన్నికల కౌంటింగ్



అక్షరటుడే,నిజామాబాద్ సిటీ: జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ మేనేజింగ్ కమిటీ ఎన్నికల కౌంటింగ్ ఉత్కంఠగా మారింది. నగరంలోని హరిచరణ్ మార్వాడీ విద్యాలయంలో ఆదివారం ఉదయం ప్రారంభమైన పోలింగ్ మధ్యాహ్నం 3గంటలకు ముగిసింది. రెడ్‌క్రాస్ సొసైటీలో మొత్తంగా 9,823మందికి ఓటింగ్ అవకాశం ఉండగా.. మధ్యాహ్నం పోలింగ్ సమయం ముగిసేనాటికి 1,552 ఓట్లు పోలయ్యాయి. ఈసారి రెడ్‌క్రాస్ ఎన్నికల ప్రచారం హోరాహోరీగా సాగింది. 29మంది అభ్యర్థులు రెండు ప్యానెళ్లుగా విడిపోయి ప్రచారం చేశారు. రాత్రి 8గంటల వరకు కూడా కౌంటింగ్ ప్రక్రియ కొనసాగుతోంది. అభ్యర్థులు, వారి మద్దతుదారులు హరిచరణ్ మార్వాడీ విద్యాలయం ఎదుట ఫలితాల కోసం ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. పోలీసులు సైతం బందోబస్తు ఏర్పాటు చేశారు.

శస్త్రచికిత్సకు ఎల్వోసీ మంజూరు



అక్షరటుడే, భీమ్‌గల్ (వేల్పూర్): మోకాలి శస్త్రచికిత్స నిమిత్తం వేల్పూర్ గ్రామానికి చెందిన జమ్మలగిరి వనీతకు రూ.1,10,000 విలువైన ఎల్వోసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) మంజూరైంది. మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి చొరవతో ఈ ఆర్థిక సాయం మంజూరు అయింది. మోకాలి శస్త్రచికిత్స కోసం వనీత ఇటీవల హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చేరారు. వైద్య ఖర్చులు ఆర్థికంగా భారమవ్వడంతో సహాయం అందించాలని వేముల ప్రశాంత్ రెడ్డిని వేడుకున్నారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే, ప్రభుత్వం నుంచి రూ.1.10 లక్షల విలువైన ఎల్వోసీ పత్రాన్ని మంజూరు చేయించారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో వనీత కుటుంబ సభ్యులకు ఈ ఎల్ఓసీ పత్రాన్ని ఆదివారం అందజేశారు. కష్టకాలంలో ఆదుకున్నందుకు ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డికి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

బతుకమ్మ సంబరాలు పోస్టర్ ఆవిష్కరణ



అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: సంస్కార భారతి ఇందూరు మహానగర్ సమితి ఆధ్వర్యంలో ఆదివారం బతుకమ్మ సంబరాలు పోస్టర్లను ఆవిష్కరించారు. బోర్గాంలోని సత్యనారాయణ స్వామి ఆలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలో ఈనెల 10వ తేదీ నుంచి 18వ తేదీ వరకు 'కలిసిమెలిసి ఆడుదాం.. మన సంస్కృతిని చాటుదాం' అని నినాదంతో ఈ ప్రోగ్రామ్ చేస్తున్నామని తెలంగాణ ప్రాంత మంచ్ కళ సంయోజక్ బెజుగం శ్రీనివాస్ పేర్కొన్నారు. ఇందూరు జిల్లాలో 10 వివిధ ప్రాంతాల్లో ఈ బతుకమ్మ సంబరాలు నిర్వహించాలని నిర్ణయించామన్నారు. సంస్కార భారతి ఇందూర్ అధ్యక్షుడు రాజకుమార్ సుబేదార్, సముద్రాల మాధురి, వరలక్ష్మి, నాగుర్తి శంకర్, కేవీ రమణాచారి, బెజగం శ్రీకాంత్, సాయ రెడ్డి, అవన్ కుమార్, రామ శేషు, నాగనాథ్ గుత్ప, శ్రీలత, తులసి, రజిత, శశిరేఖ పాల్గొన్నారు.

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆవరణలో స్వచ్ఛభారత్



అక్షరటుడే, ఆర్మూర్: పట్టణంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆవరణలో ఆదివారం ఆర్మూర్ మహాత్మా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సొసైటీ ఆవరణలో ఏపుగా పెరిగిన చెట్ల కొమ్మలు, పిచ్చిమొక్కలు, చెత్త చెదారాన్ని తొలగించి శుభ్రం చేశారు. సొసైటీ చైర్మన్ కాపెల్లి చిన్న ముత్యన్న మాట్లాడుతూ..సొసైటీ ఆవరణలో స్వచ్ఛ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం సొసైటీ సీఈవో అరె రాజేశ్వర్ మాట్లాడుతూ.. ఆర్మూర్ మహాత్మ స్వచ్ఛంద సంస్థ 74వ స్వచ్ఛభారత్ కార్యక్రమం సొసైటీలో నిర్వహించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకె శ్రీనివాస్, సభ్యులు జంగిడి భోజన్న, భాశెట్టి గంగారాం, బి ప్రశాంత్, రమేష్, మహేష్ అగర్వాల్, బట్టు సుమన్, ఎం.గణేష్, ఖుషి వర్ధన్, శ్యాంసుందర్, సుంకే నిశాంత్ తదితరులు పాల్గొన్నారు.

చందూర్ మండలంలోని కారేగాం తండా పరిధిలో సాగునీటి సమస్యకు పరిష్కారం లభించింది. చందూర్ ఎత్తిపోతల పథకం ద్వారా మెట్ట ప్రాంత రైతులకు సాగునీరు అందుబాటులోకి రావడంతో రైతన్నల్లో హర్షా తిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

– అక్షరటుడే, బాన్సువాడ



మెట్ట పంటలకు ఊపిరి

- చందూర్ ఎత్తిపోతల ద్వార సాగునీరు విడుదల
- ఎండుతున్న పంటలకు జీవం
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

చందూర్ ఎత్తిపోతల పథకం ద్వారా మండల పరిధిలో దాదాపు 3,120 ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో ఈ పథకాన్ని చేపట్టారు. ముఖ్యంగా వర్షాధారంగా వ్యవసాయం చేస్తున్న మెట్ట ప్రాంత రైతులకు ఈ పథకం ఎంతో ప్రయోజనకరంగా మారనుంది. పథకంలో భాగంగా కారేగాం తండా పరిధిలోని 1,200 ఎకరాల లక్ష్య విస్తీర్ణంలో ప్రస్తుతం సుమారు 300 ఎకరాల మెట్ట భూములకు సాగునీరు అందుతోంది. దీంతో ఎండిపోతున్న పంటలకు నీరు అందడంతో రైతులకు ఎంతో ఊరట లభించింది. సాగునీటి కోసం ఎదురుచూస్తున్న రైతులకు తమ పంటలను కాపాడుకునే అవకాశం ఏర్పడింది.

మెట్ట ప్రాంతాలకు..

మెట్ట ప్రాంతాలకు ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు అందించడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమ సాగు అవసరాలను గుర్తించి చర్యలు తీసుకున్న ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కారేగాం తండా సర్పంచ్ డా. రమావత్ లాల్ సింగ్ మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా సాగునీటి కోసం ఎదురుచూస్తున్న మా మెట్ట భూములకు ఎత్తిపోతల పథకం ద్వారా నీరు అందడం సంతోషంగా ఉందన్నారు. మా పంటలకు నీరు అందించి రైతుల సాగుకు భరోసా కల్పించిన శ్రీ పోచారం శ్రీనివాస్ రెడ్డికి రైతన్నల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

రైతుల్లో ఆశలు

చందూర్ ఎత్తిపోతల పథకం పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉందని రైతులు అన్నారు. నీటి విడుదల సందర్భంగా వారు పూజలు చేశారు. సాగునీరు అందడంతో రైతుల్లో కొత్త ఆశలు చిగురించాయని, వ్యవసాయ రంగ అభివృద్ధికి ఈ పథకం ఎంతో దోహదపడుతుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ బూత్ అధ్యక్షుడు వసంత్ రావు, మెట్ట ప్రాంత రైతులు సర్దార్, రమేష్, ప్రతాప్, నారాయణ, రాములు, సంతోష్, విఠల్ పాల్గొన్నారు.

సహారా బాధితుల సంక్షేమ సంఘం ఏకగ్రీవ ఎన్నిక



అక్షరటుడే, కామారెడ్డి: సహారా సంస్థలో చిక్కుకున్న ఖాతాదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించే లక్ష్యంతో కామారెడ్డి సహారా బాధితుల సంక్షేమ సంఘాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని గాంధీనగర్ ఆర్యవైశ్య భవనంలో తెలంగాణ సహారా బాధితుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వడ్ల బాలయ్య, ముఖ్య సలహాదారు వేల్పుల బాలరాజు ఆధ్వర్యంలో కార్యవర్గం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తృప్తి అనిల్, ప్రధాన కార్యదర్శిగా వెన్ను పూర్ణచందర్, కోశాధికారిగా అంకం బాలరాజ్, ఉపాధ్యక్షులుగా అశోక్, చింతల రాజేష్, వంగల తులసిదాస్, మహిళా అధ్యక్షురాలిగా విజయ, సహాయ కార్యదర్శులుగా సత్యనారాయణ, మాధవరెడ్డి, పబ్బ కిరణ్, రాజలింగం, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా అశోక్, కార్యవర్గ సభ్యులుగా కొండ భూమయ్య, సిద్దా గౌడ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వడ్ల బాలయ్య మాట్లాడుతూ.. దేశంలో 13 కోట్ల మంది ఖాతాదారులు, 12 లక్షల మంది కార్యకర్తల పెట్టుబడులు సహారా కోఆపరేటివ్ సంస్థలో చిక్కుకుపోయాయని, వాటిని రాబట్టేందుకు ఉద్యమాన్ని ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. సమస్యల పరిష్కారం వరకు పోరాటం కొనసాగించాలన్నారు. ముఖ్య సలహాదారు వేల్పుల బాలరాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వెంటనే సహారా ఆస్తులను జప్తు చేసి ఖాతాదారులకు చెల్లింపులు చేయాలని, సుప్రీంకోర్టులో విచారణ వేగవంతం చేసి న్యాయం చేయాలని కోరారు.

తెలుగు ఫోరం జిల్లా కార్యవర్గం ఎన్నిక



అక్షరటుడే, కామారెడ్డి: తెలుగు భాష పరిరక్షణ, తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను కాపాడే లక్ష్యంతో ఏర్పాటైన జిల్లా తెలుగు ఫోరం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. తెలుగు భాషను రక్షించుకోవడం, కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని తెలంగాణ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం, పద్య పఠనం, పద్యాలు, పాటల రచనలను ప్రోత్సహించడం, సంస్కృతి సంప్రదాయాలను కాపాడటం, ఉగాది పురస్కారాలు, కవి సమ్మేళనాలు నిర్వహించడం ప్రధాన లక్ష్యాలుగా ఈ ఫోరం పనిచేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నూతన కార్యవర్గంలో గౌరవ అధ్యక్షుడిగా అంబీర్ మనోహర్ రావు, అధ్యక్షుడిగా కడారి రవి కుమార్, ప్రధాన కార్యదర్శిగా కొత్తింటి రాజు, కోశాధికారిగా కుడిక్యాల రమేష్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా భూమన్న, సంగమేశ్వర్, విద్యాసాగర్, శ్రీధర్ రెడ్డి, జోషి శ్రీధర్, ఉపాధ్యక్షులుగా విజయశ్రీ, జ్యోతి, నాగలత, రాధిక, అకాడమిక్ కార్యదర్శిగా వెంకటేశ్వర్, సాంస్కృతిక కార్యదర్శిగా కిరణ్ ఎన్నికయ్యారు. ముఖ్య సలహాదారులుగా నరేందర్ రెడ్డి, కృష్ణమోహన్, కరుణాకర్ రావు, జె. శ్రీరాం, రాజయ్య, నర్సింహులు, కృష్ణ మోహన్, రమేష్, బాబు, కార్యవర్గ సభ్యులుగా శివశంకర్, రూప్ సింగ్, శ్రీనివాస్, సూర్య, నర్సిరెడ్డి, సురేష్, భానుచందర్, రాజయ్య, శంకర్ రాథోడ్, బాలరాజ్ గౌడ్, లక్ష్మణ్, ప్రవీణ్, నిరంజన్ లను ఎన్నుకున్నారు.

యువ నాయకుడిని పరామర్శించిన సునీల్



అక్షరటుడే, బాల్కొండ: బాల్కొండ మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ యువ నాయకుడు సన్నిత్ యాదవ్‌ను బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి సునీల్ పరామర్శించారు. ఇటీవల ప్రమాదవశాత్తు సన్నిత్ యాదవ్ కంటికి గాయం కావడంతో బాల్కొండకు వచ్చిన సునీల్ ఆయనను కలిసి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులను తెలుసుకున్న సునీల్.. జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సన్నిత్ యాదవ్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బాల్కొండ పట్టణ అధ్యక్షుడు కుందారపు శ్రీనివాస్, డీసీసీ ఉపాధ్యక్షుడు చాట్ల నరేష్, డీసీసీ జిల్లా కార్యదర్శులు మహ్మద్ యూనూస్, సంజయ్ గౌడ్, మండల ఉపాధ్యక్షుడు గడ్డం రవి, మండల కార్యదర్శులు పుల్లాయి నవీన్‌కుమార్, మార పురుషోత్తం, పిట్ల దయాకర్, బండి మల్లేష్, బాల్కొండ ఉపసర్పంచ్ గాండ్ల రాజేందర్, మర్కజ్ కమిటీ అధ్యక్షుడు మజరొద్దీన్, మాజీ ఉపసర్పంచ్ వాహబ్, అన్వార్, ఆరెపల్లి గంగాధర్, లోచారం వినేష్, షేరు, నుజ్జు, ఆరిఫ్, మేక నాగేష్, మేక సతీష్, గడ్డం సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మచ్చర్లలో వారసంత ప్రారంభం

అక్షరటుడే, ఆర్మూర్: ఆలూర్ మండలం మచ్చర్ల గ్రామంలో వారసంతను సర్పంచ్ కట్ట మల్లవ్వ నర్సయ్య, వీడీసీ అధ్యక్షుడు మహేందర్, పోషన్న ఆదివారం ప్రారంభించారు. సర్పంచ్ మల్లవ్వ నర్సయ్య మాట్లాడుతూ.. గ్రామ ప్రజలకు నిత్యావసర సరుకులు, కూరగాయలు తదితర వస్తువులు అందుబాటులో ఉండేలా వారసంతను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వారానికి ఒకరోజు నిర్వహించే ఈ అంగడిని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వ్యాపారులు, రైతులు తమ ఉత్పత్తులను విక్రయించుకునేందుకు కూడా ఇది ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. వీడీసీ సభ్యులు గంజి మహేందర్, పోషన్న, మహేందర్, మల్లెల గంగారాం పాల్గొన్నారు.



చట్టబద్ధత లేని వీడీసీ కమిటీలను రద్దు చేయాలి



అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: ఎలాంటి చట్టబద్ధతలేని గ్రామాభివృద్ధి కమిటీలను రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, బీవీఎం, ఎంఎస్ఎఫ్ విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు నగరంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో సమావేశం నిర్వహించారు. భారత రాజ్యాంగాన్ని కాపాడాల్సిన ప్రజాప్రతినిధులే వీడీసీల వ్యవస్థకు వంతపాడడం సమంజసం కాదన్నారు. తాళ్లరాంపూర్ బాధితుల ఆర్తనాదాలు ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యేలు ప్రశాంత్ రెడ్డి, పైడి రాకేష్ రెడ్డి, పీసీసీ మహేష్ కుమార్ గౌడ్‌లకు వినిపించడం లేదా అని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్మూర్, బాల్కొండ, నిజామాబాద్ రూరల్, నిర్మల్ ప్రాంతాల్లో వీడీసీలు సమాంతర ప్రభుత్వాలు నడుపుతున్నాయాని ఆరోపించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాచకొండ విగ్నేష్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కర్క గణేష్, బీవీఎం రాష్ట్ర కో ఆర్డినేటర్ శ్రీధర్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బానోతు రఘురామ్ నాయక్, బీవీఎం రాష్ట్ర కోఆర్డినేటర్ శ్రీధర్, ఎంఎస్ఎఫ్ జిల్లా నాయకులు శ్రీదీప్, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సుబోధ్, బీవీఎం రాష్ట్ర కార్యదర్శి నాగేంద్ర, నాగరాజు, వీడీసీ బాధితులు నారాయణ గౌడ్, సుదర్శన్, నర్సాగౌడ్, దేవదాస్ పాల్గొన్నారు.

వెలమ సంఘం ప్రధాన కార్యదర్శిగా విజయ్ రావు




అక్షరటుడే, మాక్లూర్: జిల్లా వెలమ సంఘం ప్రధాన కార్యదర్శిగా మాక్లూర్ మండలం మెట్ పల్లి గ్రామ వాసి బీరెల్లి విజయ్ రావు ఎన్నికయ్యారు. ఆదివారం జరిగిన జిల్లాస్థాయి ఎన్నికల్లో విజయ్ రావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సభ్యులందరూ ఆయనకు అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించిన సభ్యులందరికి కృతజ్ఞతలు తెలిపారు. సంఘం అభివృద్ధికి తన వంతు సహాయం చేస్తానని హామీ ఇచ్చారు.

వీవోపై దాడిని ఖండిస్తున్నాం..



అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: నల్గొండ జిల్లా చింతపల్లి మండలం పీకే మల్లెపల్లిలో వీవోఏపై దాడిని ఖండిస్తున్నట్లు రాష్ట్ర గ్రామ పాలన అధికారుల అర్గనైజేషన్ కార్యదర్శి సంగెం పృథ్వీరాజ్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో దళిత మహిళా వీవోఏ మాధవిపై దాడిచేసి, కులం పేరుతో దుషించిన సదరు వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేయాలని అయన డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

నడిపల్లి వద్ద రోడ్డు ప్రమాదం.. యువకుడు మృతి



అక్షరటుడే, డిచ్‌పల్లి: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన నడిపల్లి సమీపంలోని ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నడిపల్లి తండాకు చెందిన బట్టు అంజి (25) తన తల్లి బట్టు శోభితో కలిసి నిజామాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్తున్నారు. అయితే మార్గమధ్యంలో ఆటో బోల్తాపడడంతో అంజికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. తల్లి శోభికి గాయాలయ్యాయి. యువకుడి మృతితో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. తండాలో విషాదచాయలు అలుముకున్నాయి.